క్లుప్తంగా

ఉపముఖ్యమంత్రిని కలిసిన కృష్ణచైతన్య



ఉప ముఖ్యమంత్రికి స్వామివారి పటాన్ని అందజేస్తున్న కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: బాపట్ల జిల్లా, అద్దంకి మండలంలోని శింగరకొండ వేమారెడ్డి సత్రంలో సోమవారం జరిగిన నియోజకవర్గ సమీక్ష సమావేశానికి విచ్చేసిన ఉపముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య కలిసి పుష్పగుచ్ఛం అందజేసి మర్యాద పూర్వకంగా కలిశారు. వీరిలో జిల్లా దేవదాయ శాఖాధికారి పానకాలరావు, లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన ట్రస్ట్ బోర్డు చైర్మన్ నర్రా ఏడుకొండలు, కార్యనిర్వహణాధికారి ఎస్ కోటిరెడ్డి పాల్గొన్నారు.

టమాట రైతులను మోసం చేసిన చీరాల వ్యాపారి

రొంపిచెర్ల: చీరాలకు చెందిన టమాట వ్యాపారి తమను మోసం చేశాడని మండలానికి చెందిన కౌలు రైతులు కొందరు రొంపిచెర్ల పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు.. కౌలు రైతులు పి.నరసింహారెడ్డి, హరిబాబు, మంజునాథ, కృష్ణయ్య, ఆంజనేయులు, సుదర్శన్, వెంకటరామిరెడ్డి, నారాయణ ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు నెల చివరి వరకు చీరాలకు చెందిన టమాట మండీ వ్యాపారి సత్యానికి టమాట పంటను విక్రయించామని తెలిపారు. సుమారు రూ.9 లక్షల వరకు వ్యాపారి తమకు చెల్లించాల్సి ఉందని, అయితే డబ్బు చెల్లించాలని సత్యాన్ని ఫోన్‌లో అడిగితే మీకు అప్పు లేదని, దిక్కున్న చోట చెప్పుకోండని బెదిరిస్తున్నాడని, విచారణ చేసి తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం



పోలీస్ స్టేషన్ వద్ద ఇసుక టాక్టర్

వేటపాలెం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొని సోమవారం స్టేషన్‌కి తరలించారు. పందిళ్లపల్లిలో ఇసుక క్వారీ నుంచి అక్రమంగా ట్రాక్టర్‌లో తరలిస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకొన్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు మృతిపై కేసు

మార్టూరు: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి యువరైతు మృతి చెందిన విషయమై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కే కమలాకర్ తెలిపారు. కోలలపూడి గ్రామానికి చెందిన సాధినేని అశోక్ (31) ఆదివారం ట్రాక్టర్ నడుపుతూ పొలం వెళ్తూ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ తిరగబడి మృతి చెందాడు. ఈ క్రమంలో మృతుడు అశోక్ తండ్రి కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

8 నుంచి రేణుకమ్మతల్లి కొలుపులు

అద్దంకి రూరల్: చెన్నుపల్లి వంశస్తుల ఆధ్వర్యంలో అద్దంకిలోని గురుకాయపాలెం అమ్మవారి దేవస్థానం వద్ద ఈనెల 8 నుంచి రేణుకమ్మతల్లి (నాగార్పమ్మ) కొలుపులు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. దీనిలో భాగంగా 8వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటలకు సముద్రస్నానం, 9వ తేది శనివారం ఉదయం 8 గంటలకు మాతుడుపు, సాయంత్రం 8 గంటలకు అమ్మవారి నగరోత్సవం, 10వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.

7న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఈనెల 7వ తేదీన మండలంలోని కొమ్మాలపాడు గ్రామం, సజ్జాపురం రోడ్ వద్ద ఉన్న శ్రీకృష్ణ బృందావనం క్షేత్రంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు క్షేత్రం వ్యవస్థాపకుడు జీ మల్లికార్జునరావు సోమవారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలు విజయవంతం చేయాలని కోరారు

శంఖవరప్పాడు ఉపసర్పంచ్ ఏకగ్రీవం



బురుగ ఆదిశేషు

అద్దంకి రూరల్: మండలంలోని శంఖవరప్పాడు ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి గంగాధర్ సోమవారం తెలిపారు. ఎన్నికల నిర్వహణకు 12 మంది వార్డు సభ్యులకు గాను గ్రామ సర్పంచ్‌తో కలిపి ఎనిమిది మంది హాజరయ్యారు. వీరందరూ వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి బురుగ ఆదిశేషును ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.



బల్లికురవలో పింఛన్ నగదు అందజేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ చైతన్య



సంతమాగులూరులో పింఛన్ అందజేస్తున్న చైతన్య

చంద్రబాబు నాయుడు అసత్యాల పుట్ట

- నూతన పింఛన్ల పంపిణీలో శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య
- 191 మందికి కొత్త పింఛన్లు పంపిణీ..

బల్లికురవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు, పింఛన్లు వర్తింపజేస్తున్నారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. సోమవారం బల్లికురవలో 20 సచివాలయాల పరిధిలో కొత్తగా మంజూరైన 151 పింఛన్‌లకు సంబంధించి లబ్ధిదారులకు మంజూరు పత్రాలతో సొమ్ము పంపిణీ చేశారు. మరో 255 మంది అర్హులుగా ఎంపికయ్యారని వెరిఫికేషన్ పూర్తయిందని త్వరలో వీరికి కూడా పింఛన్ అందిస్తామని చైతన్య చెప్పారు. అధికారం కోసం కల్లబొల్లి మాటలు చెప్పే చంద్రబాబు ఆయన కుమారుడు లోకేష్ మాటలు నమ్మవద్దన్నారు. జగనన్న మేనిఫెస్టోను భగవద్గీతగా, ఖురాన్, బైబిల్‌గా భావించారని చెప్పారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు కరోనా విపత్తులో ఉన్న సంక్షేమ క్యాలెండర్ ప్రకారం పథకాలన్నీ అందిస్తూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రపంచ దేశాల్లోనే నెంబర్‌వన్ సీఎంగా గుర్తింపు పొందారన్నారు. పథకాలన్నీ కొన సాగాలంటే రాబోయే ఎన్నికల్లో కూడా జగనన్నను సీఎంగా ఆశీర్వదించాలని చైతన్య అవ్వాతాతలను ప్రార్థించారు. పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, స్థానిక నేతలు చింతల శ్రీనివాసరావు, దివ్యా రామాంజనేయులు, షేక్ శ్రీను వలి, పాలవులూరి చందు, చల్లగుండ్ల కోటిస్వామి, మాదాల శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సంతమాగులూరు (అద్దంకి రూరల్): సంతమాగులూరు మండలంలో కొత్తగా మంజూరైన 191 మందికి సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పింఛన్‌లకు సంబంధించి లబ్ధిదారులకు మంజూరు పత్రాలతో సొమ్ము పంపిణీ చేశారు. మరో 231 మంది అర్హులుగా ఎంపికయ్యారని వెరిఫికేషన్ పూర్తిఅయిందని త్వరలో వీరికి కూడా పింఛన్‌సొమ్ము అందిస్తామని చైతన్య వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ సభ్యులు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షుడు, సభ్యులు, వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

- గడప గడప కార్యక్రమంలో కరణం వెంకటేష్

చీరాల: గత ప్రభుత్వాలు సంక్షేమ పథకాలన్ని ఆ పార్టీ కార్యకర్తలకు మాత్రమే అందించేవి.. ప్రస్తుతం రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత అర్హతే ప్రామాణికంగా తీసుకుని పార్టీలకు అతీతంగా నవరత్నాలు పథకాలతో పాటు ఇతర సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. సోమవారం చీరాల రూరల్ మండలం పాతచీరాల సచివాలయం పరిధిలో గడప గడప కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఒక వేళ అర్హత ఉండి పథకాలు అందక పోతే వెంటనే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అలానే నియోజకవర్గంలో కోట్ల రూపాయాలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. వార్డులోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని తగు పరిష్కారం చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నేతాజీ, మున్సిపల్ వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, ఆర్‌బికె చైర్మన్ కావూరి రమణారెడ్డి, ఆసాది అంకాలరెడ్డి, బక్కా అద్దంకిరెడ్డి, రాంబాబు, పాకల నాగరాజు, కె.శ్రీనివాసరావు, శవనం సుబ్బారెడ్డి, బి.రాంబాబు, ఎం.దేవేంద్ర, వి.ఆదినారాయణ, గవిని శ్రీనివాసరావు, కుంచాల రత్నారెడ్డి, ఆసాది దశరథరామిరెడ్డి, బోయిన బాజిరెడ్డి, శవనం నాగేంద్రరెడ్డి, భోగిరెడ్డి సుబ్బారెడ్డి, సూరిన రవిచంద్రారెడ్డి, నంగు వెంకటరెడ్డి, దేవు అద్దంకిరెడ్డి, బక్కా శివనాగేశ్వరరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి

- గడప గడపలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి



ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఆమంచి

ఇంకొల్లు (చినగంజాం): నియోజకవర్గంలో సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు తాను కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఇంకొల్లు మండలం ఇడుపులపాడు గ్రామ సచివాలయం పరిధిలో ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు వివరించారు. గ్రామంలో ప్రజలు బాణాసంచా కాలుస్తూ ఆయనకు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ఆయన విఘ్నేశ్వరుడికి పూజలు చేసిన అనంతరం సీతారామాలయాన్ని సందర్శించారు. గ్రామంలోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామంలోని ప్రతి గడపగడపకు తిరుగుతూ ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరిస్తూ, ప్రభుత్వ పథకాలు పొందేందుకు అర్హత ఉన్న వారి గురించి ఆరా తీస్తూ ఆయా పథకాలకు సంబంధించిన అధికారులతో అర్హులకు వెంటనే లబ్ధి చేకూరేలా చూడాలని ఆయన సూచించారు. గ్రామంలో పలు ప్రాంతాలలో అంతర్గత రోడ్లు, విద్యుత్ స్తంభాలు, డ్రైనేజీ వంటి పలు సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొని వచ్చారు. సమస్యలకు సంబంధించి ఆయన అధికారులను పిలిపించి సమస్యల పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. పలు సమస్యలకు ఆయన స్వయంగా పరిష్కార మార్గాలు సూచించారు. ఏడు నెలలుగా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతూ ముందుకు వెళ్తున్నానని అన్నారు. కొమ్మమూరు కాలువకు సంబంధించి నియోజకవర్గంలో ఉన్న 1.15 లక్షల ఎకరాలకు నీరందించేందుకు చివరి భూముల వరకు నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. గతంలో పనిచేసిన గాదె వెంకటరెడ్డి, దగ్గుబాటి వెంకటేశ్వరరావులు అభివృద్ధి పనులు చేసినప్పటికీ వాటిని నిర్వాహణ లోపం కారణంగా సమస్యలు ఉత్పన్నమయ్యాయని చెప్పారు. వాటిని కూలకషంగా అధ్యయనం చేసి ఒకదాని తరువాత ఒకటి పరిష్కరిస్తానన్నారు. 1950 సెక్షన్ 20 ప్రకారం ఎక్కడ నివాసముంటే అక్కడే ఓటు ఉండాలన్నారు. వివాహిత మహిళలు, విదేశాల్లో ఉండే వారు, వేరే ప్రాంతాల్లో వలస వెళ్లిన వారికి స్థానికంగా నివాసముండే ప్రాంతంలో ఓటు హక్కు ఉంటుందని తెలిపారు. కొంత మంది రాజకీయ అవగాహన రాహిత్యంతో ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని అన్నారు. సొంత గ్రామంలో పెద్ద భవనాలు ఉన్నా, వందల ఎకరాలు భూములున్నా నివాసం లేనిదే ఓటు హక్కు ఉండదని ఆయన అన్నారు. గత 20 ఏళ్లగా ఈ విధంగా ఓట్లు కలిగి, ఎన్నికల సమయానికి 400 బస్సులు, 4 వేలు కార్లు ద్వారా వేరే ప్రాంతాల నుంచి ప్రజలను తరలించి తీసుకొచ్చి ఓట్లు సమయానికి వారిని వినియోగించుకుంటున్నారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంఎస్ రాజ్యలక్ష్మి, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఏపీఓ రేణుకు,ఏపీఎం టీ మోహనరావు, ఏఓ వేణుగోపాలరావు, ఏఈలు సుబ్బారావు, రామకృష్ణ, ఈఓ శేషగిరిరావు, మండల కన్వీనర్ బీ ప్రభాకరరావు, సర్పంచ్ బండారు సుమతి, అడపా సుధాకర్‌రెడ్డి, స్వాములు, నూతలపాటి బలరాం, కాసు పిచ్చిరెడ్డి, అంబటి చరణ్, శ్రీనివాసరావు, ఎంపీటీసీ గుంజి బాబు, ఏ ప్రభుదాసు, వైస్ సర్పంచ్ మారుతీ బాబు, నాగేశ్వరరావు, సంపతి శ్రీనివాసరావు, జీ మహేష్, పూసపాడు ఎంపీటీసీ కంకట రాంబాబు, రావి పేరయ్య, వైస్ ఎంపీపీ చలమయ్య, ధనుంజయ రాజు, ఆదియ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

రైతులు వరిసాగు విరమించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

చినగంజాం: కాలువలకు నీరు రానందున మండలంలోని రైతులు వరి సాగు విరమించుకోవాలని మండల వ్యవసాయాధికారి కే బాస్కరరావు అన్నారు. సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల్లో నీటి నిలువలు పూర్తిస్థాయిలో అడుగంటినందున రైతులు ఏర్పాటు చేసుకున్న పంటలకు అవసరమైన నీటిని విడుదల చేయడం సాధ్యం కాదన్నారు. కావున రైతులు వరి పైరు వేయొద్దని కొమ్మమూరు ఇంజినీరు అధికారులు సమాచారం ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ ఏడాది వర్షాలు లేనందున ఒక్క తాగునీటికి మాత్రమే నీటిని విడుదల చేస్తారని, మాగాణికి నీరు అందించరని రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీ పార్వతి, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం ధర్నా

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. సీపీఎం చీరాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం చీరాల ఎమ్మార్వో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలి అని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, ఉపాధి అవకాశాలు కలిపించాలన్నారు. కుందేరుని ఆధునికీకరించి పట్టణ డ్రైనేజిని కుందేరుకి అనుసంధానం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం చీరాల పట్టణ కమిటీ కార్యదర్శి నలతోటి బాబురావు, కమిటీ సభ్యులు ఎమ్. వసంతరావు, లింగం జయారాజు తదితరులు పాల్గొన్నారు.

6న బత్తుల ట్రస్ట్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం

చీరాల అర్బన్: చీరాల బత్తుల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీ స్థానిక రోటరీ క్లబ్‌లో గురుపూజా మహోత్సవం నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల బ్రహ్మారెడ్డి, వీ రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఆత్మీయ అతిథులుగా వలివేటి మురళీకృష్ణ, గుంటుపల్లి సుబ్బారావు, నంగిరాజు విజయ్‌కుమార్ విచ్చేయనున్నట్లు తెలిపారు. చీరాల, చీరాల పరిసర ప్రాంత ఉపాధ్యాయుల్లో 15 మంది ఎంపిక చేసి వారికి పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు బ్రహ్మారెడ్డి తెలిపారు.

కారంచేడులో కుండపోత



కారంచేడు చినవంతెన సెంటర్ వద్ద నీట మునిగిన రహదారులు



పెదబజారులో నిలిచిన నీరు

కారంచేడు: కారంచేడు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కుండపోతగా వర్షం కురిసింది. సోమవారం ఉదయం నుంచి వాతావరణం మేఘావృతంగా మారింది. కొద్దిపాటి చిరుజల్లులతో ప్రారంభమైన వర్షం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4గంటల వరకు ఒక గంట పాటు కదలనీయకుండా కుండపోతగా వర్షం పడింది. దీంతో వీధులతో పాటు, ప్రధాన రహదారులు సైతం నీట మునిగాయి. ద్విచక్రవాహనాలు కూడా ముందుకు కదలని విధంగా నీరు నిలిచిపోయాయి. చినవంతెన సెంటర్ నుంచి కాలువ సెంటర్ వరకు, బందెలదొడ్డి బజారు నుంచి పెద బజారు సెంటర్, రామాలయం బజారు, మస్కో బజారులు కూడా నీట మునిగాయి. కాలువ సెంటర్‌లోని ఎస్టీ కాలనీ ఇళ్ల గుమ్మాల వద్దకు నీరు చేరాయి. అయితే ఈ వర్షం అన్నదాతలకు మాత్రం జీవం పోసిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సిలోన్ కాలనీవాసుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న సిలోన్ కాలనీ వాసులు

వేటపాలెం: సిలోన్ కాలనీలో నివాసం ఉంటున్న కాందిశీకుల సమస్యలు వెంటనే పరిష్కరిచాలని కోరుతూ శ్రీలంక పార్టీయేటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సిలోన్ కాలనీ వాసుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. కాలనీ వాసులకు మద్దతుగా సీపీఎం నాయకులు టీ బాబూరావు, సీఐటీయూ నాయకులు పి కొండయ్య పాల్గొని మాట్లాడుతూ సిలోన్ కాలనీకి అప్పటిలో కేంద్ర ప్రభుత్వం కాందిశీకుల కాలనీ నిర్మాణం కోసం కేటాయిం చిన 9.99 ఎకరాల స్థలానికి హద్దులు నిర్ణయించాలని కోరారు. కాలనీ వాసులకు అందరికి ప్రభుత్వం ఇటీవల పట్టాలు పంపిణీ చేశారని తెలిపారు. అయితే ఇంకా మరి కొంత మందికి పట్టాలు ఇవ్వాల్సి ఉందని కోరారు. వీరి 27 ఇళ్ల ఆక్రమంచిన కుటుంబాలను వెంటనే ఖాళీ చేయించాలని కోరారు. హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినప్పటికి వారిన అధికారులు ఇప్పటివరకు ఖాళీ చేయించలేదన్నారు. కార్యక్రమంలో శ్రీలకం పార్టీయేటర్స్ అసోసియేషన్ నాయకులు శివనాడియన్, సత్యవేలు, సీపీఎం నాయకులు మచ్చ అయ్యరెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



లింగకార్షక బుట్టలను పరిశీలిస్తున్న డీఆర్‌సీ, శాస్త్రవేత్తలు

వేటపాలెం: వేరుశనగలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు పొందవచ్చని డాట్ సెంటర్ శాస్త్రవేత్త ఓబయ్య పేర్కొన్నారు. మండల పరిధిలో సాగు చేసిన వేరుశనగ పైరును డాట్ సెంటర్ శాస్త్రవేత్తలతో పాటు డీఆర్‌సీ విజయనిర్మల సోమవారం పరిశీలించారు. వ్యవసాయశాఖ ద్వారా వేరుశనగ రైతులకు పది ఎకరాల్లో 100 లింగాకర్షక బుట్టలు ఇటీవల ఉచితంగా అందజేసినట్లు డీఆర్‌సీ విజనిర్మల తెలిపారు. ఈబుట్టల పనితీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించామన్నారు. పొగాకు లద్దె పురుగుల నుంచి కాపాడు కోవడానికి ఈబుట్టలు ఉపయోగపడతాయన్నారు. అంతేకాకుండా తవుడు, బెల్లం, పురుగుమందుతో కలిపి విషపుఎరను తయారు చేసి ఉపయోగించుకోడం వల్ల పురుగులను నిర్మూలించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ఐ కాశీవిశ్వనాథ్, రైతులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కృష్ణ సేవలు ప్రశంసనీయం



ఎంపీడీవోను సత్కరిస్తున్న సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు

బల్లికురవ: మండలస్థాయి అధికారులు, సచివాలయంలోని వివిధ శాఖలను నొప్పించకుండా చాకచక్యంగా పనులు చేయిస్తూ మండలాన్ని ప్రగతిబాటలో నిలిపిన ఎంపీడీవో సీహెచ్ కృష్ణ సేవలు ప్రశంసనీయమని సచివాలయ సంఘ చీరాల డివిజన్ ఉపాధ్యక్షుడు టీ వజ్రయ్య అన్నారు, డీఎల్‌డీవోగా పదోన్నతి పొందిన బల్లికురవ ఎంపీడీవో సీహెచ్ కృష్ణకు సోమవారం స్థానిక కార్యాలయంలో సచివాలయ వేల్ఫేర్ అసిస్టెంట్‌ల ఆధ్వర్యంలో దుశ్శాలువాలతో సత్కరించారు. విధి నిర్వహణలో కూడా తమకు మార్గదర్శకుడిగా ఎన్నోవిషయాలను తెలిజేశారని ముక్తేశ్వరం, బల్లికురవ, ఎస్ఎల్ గుడిపాడు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్‌లు గోంవింద నాయక్ పోతురాజు, చాంముండేశ్వరీ, కొనియాడారు.

సాంస్కృతిక చైతన్యం అవసరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

చీరాల అర్బన్: ప్రజల్లో సాంస్కృతిక చైతన్యం, శాస్త్రీయ ఆలోచనా విధానం అవసరం అని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు కోట వెంకటేశ్వర రెడ్డి అన్నారు. జన విజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో గౌతమి విద్యాసంస్థల ఆవరణలో నేటి సమకాలీన సమాజంలోని శాస్త్రీయ భావాలను అభ్యుదయ భావాలను పెంపొందించుట నేటి ప్రధాన కర్తవ్యం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సదస్సుకు గౌతమి విద్యాసంస్థల నుంచి ఎం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ అధ్యక్షులు గాదె హరిహరరావు, ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య గాయణిమణులు డీ నిర్మలమ్మ,ఏ కళ్యాణి, వెంకటేశ్వర రెడ్డి, అచ్యుత్ శ్రీనివాసరావు,నాగార్జున పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

మార్టూరు: పర్చూరు సెబ్ సీఐ ముప్పాళ్ల యశోధరాదేవి సోమవారం సాయంత్రం మండలంలోని ద్రోణాదుల గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేశారు. ఆమె అందించిన వివరాల మేరకు.. గ్రామం వెలుపల పేకాడుతున్న సమాచారంతో దాడి చేసి పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని వారి నుంచి రూ 3300 నగదు స్వాధీనం చేసుకొని వారిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు,

చిమటావారిపాలెంలో విగ్రహ ప్రతిష్ట

యద్దనపూడి: మండలంలోని చిమటా వారిపాలెం గ్రామంలో సీతారామస్వామి ఆలయం పక్కన గణిపుశెట్టి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం ఉమామహేశ్వరస్వామి, వినాయకుడు, నంది, పరివార దేవతలుగా విగ్రహాలను, సుధా బింబ ప్రతిష్ట కార్యక్రమం చేశారు. విగ్రహాలను వారి కుమారులు శ్రీనివాసరావు, రాఘవయ్యలు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. యాజ్ఞికులు చింతపల్లిపాడు నారాయణం శ్రీనివాసాచార్యులు, వెంకట సందీప్ దీక్షితులు సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని భక్తులందరూ ఉమామహేశ్వర స్వామినిదర్శించి,అన్నప్రసాదస్వీకరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మేదరమెట్ల: బైక్‌ను వెనుకవైపు నుంచి ఢీకొట్టడంతో ఓవ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన బొడ్డువానిపాలెం సోమవారం రాత్రి జరిగింది. అందిన సమాచారం మేరకు.. మేదరమెట్లకి చెందిన ఎం మహేష్ అద్దంకి నుంచి మేదరమెట్ల వైపు తన బైక్‌పై వస్తున్నాడు. ఈక్రమంలో లారీ అదే దారిలో వస్తూ మహేష్ బైక్‌ను వెనుకవైపు నుంచి ఢీకొట్టింది. దీంతో మహేష్ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించారు. క్షతగాత్రుడుని చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.